ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5★ పెద్దపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 15 సెప్టెంబరు 2025



ఉపాధి కూలీలకు అందని వేతనాలు

- నాలుగు నెలలుగా ఎదురు చూపులు
- దసరా పండుగుకు అందేనా?
- ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్

పాలకుర్తి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం అమలు తీరుపై కూలీలు పెదవి విరుస్తున్నారు. ఉపాధి కల్పన తగ్గిపోవడంతో పాటు, చేసిన పనికి వేతనాలు కూడా ఇవ్వడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు నాలుగునెలల నుంచి వేతనాలు అందడం లేదు. దీంతో పనులు చేసిన కూలీలు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నిలదీస్తున్నారు. వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిం దని కూలీలు వాపోతున్నారు. మరో పక్క మూడు నెలలుగా తమకు కూడా జీతాలు రావడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు

(మిగతా 8వ పేజీలో)

నాలుగు నెలలుగా మాకు కూలి డబ్బులు రావడం లేదు

- గద్దల రాజమ్మ, ఉపాధి కూలీ, జయ్యారం



మా కుటుంబం ఉపాధీ హామీ పనులపైననే ఆధారపడి కాలం వెళ్ల దీస్తోంది. నాలుగు నెలలుగా మాకు కూలి డబ్బులు రావడం లేదు. రానున్న సద్దుల బతుకమ్మ పండుగలోపు మాకు డబ్బులు అందితే అందరిలాగా పండుగను సంతోషంగా జరుపు కుంటాం. లేకుంటే ఇబ్బందులు పడాల్సిందే. ప్రభుత్వ వెంటనే కూలి డబ్బులు జమచేయాలి.

కూలీలు ఎవ్వరు అధైర్యపడవద్దు

- కలికోట రామ్మోహన చారి, ఎంపీడీవో



ఉపాధి హామీ కూలీలు ఎవ్వరు అధైర్యపడవద్దు. మండలంలో జరిగిన పనులు, క్రమం తప్పకుండా పనులకు హాజరైన కూలీల సంఖ్య, ఇప్పటివరకు కూలీలకు అందించిన డబ్బులు, కూలీలకు రావాలసిన డబ్బుల వివరాలు ఎఫ్‌టీవోలను జనరేట్ చేసి పంపించాం. త్వరలో కూలీల ఖాతాల్లో డబ్బు జమ అవుతుంది.

యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వమే కారణం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో యూరియా కొరత, రైతులు పడుతున్న గోసకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టి ముక్కుల సురేష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు 6లక్షల 12వేల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం పంపించినట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రం వద్ద ఒక లక్ష 76వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, అయినా యూరియా కొరత ఎందుకు ఏర్పడిందని ప్రశ్నించారు. రైతులకు యూరియా సరిగా సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలకు ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తారని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సైతం యూరియా అడిగిన రైతులకు బేడీలు వేసి జైళ్లకు పంపించిన ఘనతను మూటగట్టుకుందని గుర్తుచేశారు. రైతుల కన్నీళ్లతో కాలం వెళ్ళదీస్తున్న ఇరు పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, జీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కనుకుంట్ల జోగేందర్, బొడ్డుపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

భూపాలపల్లి జిల్లా మాదిగశక్తి అధ్యక్షుడిగా పులిగంటి మల్లేష్


నియామకపు పత్రాన్ని అందజేస్తున్న సన్నీ

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం చిన్నతూండ్ల గ్రామానికి చెందిన పులిగంటి మల్లేష్‌ను మాదిగశక్తి భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్నీ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం నియామకపత్రాన్ని మల్లేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్‌సన్నీ మాట్లాడుతూ మాదిగలు ఆర్థిక,రాజకీయ, సామాజిక,విద్య,ఉద్యోగ, వ్యాపారరంగాల్లో అభివృద్ధి చెందడానికి మాదిగశక్తి సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. అంబేద్కర్,మన్యవార్ కాన్షీరాం ఆశయాల సాధనకు మాదిగశక్తి నిరంతరం కృషిచేయాలని మల్లేష్‌కు సూచించారు. తనపై నమ్మకంతో నియామకం చేసిన సురేందర్ సన్నీకి, తన నియామకానికి సహకరించిన పెద్దపల్లిజిల్లా అధ్యక్షుడు కల్లపల్లిరవికి మల్లేష్ కృతజ్ఞతలు తెలియజేశాడు.

షిర్డీలో ఎలిగేడు భక్తుల సేవలు

ఎలిగేడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని షిర్డీలో నాలుగురోజులు నుంచి షిర్డీసాయిబాబా భజన మండలి గౌరవ అధ్యక్షుడు నలుమాచు చంద్రశేఖర్ రాణి ఆధ్వర్యంలో ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన భక్తులు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇందులో భజనలతో పాటు నిరుపేదలకు నిత్యావసర సరుకులు, యాచకులకు దుప్పట్లు పంపిణీ చేసి, వారి ఉదారతను చాటుకుంటున్నారు. నాలుగేళ్ల నుంచి ప్రతిసెప్టెంబర్‌లో పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో కేశెట్టి లక్ష్మణ్‌కుమార్, కట్కూరు చంద్రశేఖర్, జవ్వాజి వెంకన్న, తాటిపల్లి సతీష్ బాబు, జయశ్రీ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కావ్యకు పెద్దపల్లి ఐటీఐ గ్రౌండ్‌వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. అసోసియేషన్ సభ్యులు కొంకటి శ్రీనివాస్, గోపుశ్రీనివాస్, పెరిసింగుల సంతోష్ రెడ్డి, కొలిపాక లక్ష్మీనర్సయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ అన్నెడి వెంకటరెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ బోర్డు డైరెక్టర్ అతీఫ్, డాక్టర్‌శ్రీనివాస్,డాక్టర్‌రాజమౌళి పాల్గొన్నారు.

సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు విశేష స్పందన

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రినిటి ప్రైమరీ స్కూల్‌లో ఆదివారం జరిగిన సబ్‌జూనియర్ కబడ్డీపోటీల్లో పలువురు క్రీడాకారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. బాలుర విభాగంలో 177మంది, బాలికల విభాగంలో 191మంది విద్యార్థులు పాల్గొనగా, ట్రినిటీ విద్యాసంస్థల ఛైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, డైరెక్టర్ దాసరి మమతారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో సత్తాచాటి జిల్లాకు మంచిపేరు తీసుకు రావాలని కోరారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలు ఈ నెల 25నుంచి 28వరకు నిజామాబాద్ జిల్లాలో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మయ్య, శంకరయ్య, కృష్ణయ్య, జిల్లా పెటా అధ్యక్షుడు వేల్పుల సురేందర్, కార్యదర్శి రమేష్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మణ్, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి షఫీ, రాజేందర్ రెడ్డి, హరికృష్ణ, పీఈటీలు భాస్కర్, వెంకటేష్, విష్ణు, ఆసియా బేగం, శివాని, ప్రణయ్, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విద్యాసంస్థల ఛైర్మన్ ప్రశాంత్ రెడ్డి

మినీ స్టేడియం స్థలాన్ని పరిశీలించిన మంత్రి

ధర్మారం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించతలపెట్టిన మినీ స్టేడియం స్థలాన్ని ఎస్‌సి, ఎస్టీ, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట సర్వేనంబర్ 476లో మినీ స్టేడియం కోసమని ఇప్పటికే స్థలం కేటాయించినా, కొన్నిసంవత్సరాలుగా స్టేడియం నిర్మాణానికి అడుగులు పడలేదు. ఆదివారం స్థానిక నాయకులతోకలిసి ఆ స్థలాన్ని పరిశీలించిన మంత్రి అడ్లూరి పూర్తివివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ స్థలమంతా బండరాళ్లతో నిండి ఉండడంతో తదుపరి చర్యల కోసం మైనింగ్ అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వస్థలాన్ని చదును చేసి మినీ స్టేడియంతో పాటు, వాకింగ్ ట్రాక్, నిర్మిస్తామని, మిగిలిన స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అందుబాటులోకి తెస్తామని మంత్రి పేర్కొన్నారు. ఆయనతోపాటు ఏఎంసీ ఛైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ ఛైర్మన్ అరిగె లింగయ్య, కాడె సూర్యనారాయణ, సోగాల తిరుపతి, ఓరెం చిరంజీవి, పొన్నవేని స్వామి, దేవి అఖిల్, పాలకుర్తి సాయి, కాంసాని ఎల్లయ్య తదితరులు ఉన్నారు.


క్రీడా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి అడ్లూరి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదాం

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్‌రావు

సుల్తానాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదామని ఆపార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి అశోక్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానికంగా ఒక ప్రైవేట్ కళ్యాణమండపంలో ఆదివారం జరిగిన బీజేపీ ముఖ్యకార్యకర్తలు, నాయకుల సమావేశం జరిగింది. ఈసమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, విజయం సాధించే దిశగా తగిన కార్యచరణ రూపొం దించుకుంటున్నామని అన్నారు. ఎన్నికలను ఎదురుకోవడానికి కార్యకర్తలు నాయకులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. బీజేపీ సేవా పక్వాడా కార్యక్రమ జిల్లాకోకన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతు ప్రధానిమోదీ జన్మదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరాలు మొక్కలు నాటడం, జాతీయనేతల చిత్రపటాలకు పుష్పాంజలి నిర్వహిస్తామన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ఏగోలపు సదయ్య, చిట్టవేని సదయ్య, సాయికిరణ్, లంక శంకర్, వేగోళపు శ్రీనివాస్‌గౌడ్, ఎల్లంకి రాజన్న, ఎనగందుల సతీష్, గజభీంకార్ పవన్,బూసారపు సంపత్, తిరుపతి, కందునూరి తిరుపతి, శ్రీగిరి సుధాకర్, గుడ్ల వెంకటేశ్, రామిడి రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి అశోక్ రావు

ఉనికి కోసమే మాజీల ఆరోపణలు

వైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా తమ ఉనికి కాపాడుకోడానికే మాజీ ఎమ్మెల్యేలు చందర్, పుట్టమధు కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నట్టు యూత్ కాంగ్రెస్ జిల్లాఉపాధ్యక్షుడు ఇరికి మహేష్ ఆరోపించారు. ఆదివారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండం నియోజకవర్గంలో మక్కాన్ సింగ్ గెలిచిన తర్వాత 900కోట్ల అభివృద్ధిపనులు జరుగుతున్నాయన్నారు. అక్రమ కట్టడాలను కార్పొరేషన్ సిబ్బంది కూల్చితే కోరుకంటి చందర్ దాన్ని ఎమ్మెల్యేకు ఆపాదించడం సరికాదన్నారు. శ్రీధర్‌బాబుపై పుట్ట మధు చేస్తున్న ఆరోపణలను ఖండి స్తున్నట్టు మహేష్ తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మక్కాన్‌సింగ్, శ్రీధర్‌బాబులపై విమర్శలు చేస్తున్నట్టు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి సూచనల మేరకు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో స్పాట్‌అడ్మిషన్‌ల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె లక్ష్మీనర్సయ్య తెలిపారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో కళాశాలలో నేరుగా సంప్రదించాలని కోరారు. స్పాట్ అడ్మిషన్‌ల ద్వారా సీట్లు పొందిన విద్యార్తులు ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఉండదని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఖాళీలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణంలోని అశోక్‌నగర్‌లో నిర్వహిస్తున్న పాఠశాల కళాశాల వసతిగృహంలో సీట్లు ఖాళీగా ఉన్నాయని హాస్టల్ వార్డెన్ మేకల అంజయ్య తెలిపారు. ఇంటర్‌మీడియట్ విద్యార్థులు, ఇంజనీరింగ్ విద్యార్థులు ఈహాస్టల్‌లో ఉండేందుకు తగిన వసతి సౌకర్యాలు ఉన్నాయన్నారు. యాభైసీట్లు ఖాళీగా ఉన్నాయని చేరేందుకు ఆసక్తి చూపే విద్యార్థులు తమను సంప్రదించాలని సూచించారు.

ప్రతి రైతుకు యూరియా అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్


ఈసాలతక్కళ్లపల్లిలో యూరియా పంపిణీని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే

పాలకుర్తి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు యూరియాను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వలక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. ఆదివారం ఆయన మండలం పరిధిలోని కొత్తపల్లె, తదితర గ్రామాల్లో జరిగిన యూరియా పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎవరూ యూరియా కోసం ఆందోళన పడవలసిన అవసరం లేదని అన్నారు. ప్రతి రైతుకు సరిపడా యూరియా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలి

- ఖనిలో ముస్లింల ర్యాలీ

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త చూపిన ధర్మమార్గంలో నడవాలని తన్‌జీమ్ ప్రధానకార్యదర్శి షేక్ హాజీఅలీ అన్నారు. మిలాన్ ఉన్ నబీ సందర్భంగా ఆదివారం గోదావరిఖనిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మద్‌ప్రవక్త ఐకమత్యం, సోదరభావం, ధర్మమార్గంలో నడవాలని సూచించి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ర్యాలీ గోదావరిఖని గాంధీనగర్, కళ్యాణ్‌నగర్, రీగల్ షూమార్ట్, శివాజీనగర్ గుండాచౌరస్తా వరకు సాగింది. కార్యక్రమంలో మౌలాన మహ్మద్ నసీర్, ఉమర్, హబీబ్, గులాం సాబ్రి, గౌస్ బేగ్, ఫజల్ బేగ్, జాకీర్, జాని, బాజీ, అఫ్రిద్, అన్వర్, నాజీమ్, నిషాద్ పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

అవసరం లేకున్నా మందుల కొనుగోళ్లు

- ఖని ఆసుపత్రిలో మందుల కొనుగోల్‌మాల్
- సెప్టిక్ ట్యాంక్‌లో గర్భ నిర్ధారణ కిట్‌లు, ఆంపిల్స్, సిరంజిలు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు అవసరం లేకున్నా సుమారు రూ.30 లక్షల విలువ చేసే మందులను కొనుగోలు చేసి డబ్బులు దండుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఆసుపత్రిలో కాలం చెల్లిన కొన్ని మందులను బసంత్‌నగర్‌లోని బుగ్గ గుట్టల వద్ద కాల్చివేయగా, మరికొన్ని కిట్లను, ఆంపిల్స్‌ను ఆసుపత్రిలోని పని చేయని సెప్టిక్ ట్యాంకు కుండీల్లో పడవేసి మూతలు వేశారు. కాలం చెల్లించిన మందులను పెద్దఎత్తున ఆసుపత్రి నుంచి బసంత్‌నగర్‌లోని బుగ్గగుట్టల వద్దకు తరలించి కాల్చివేశారు. మిగిలినవి ఆసుపత్రి ఆవరణలో అక్కడక్కడ కుండీల్లో పడవేసిన దృశ్యాలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కొత్త బిల్డింగ్ పక్కన పని చేయని సెప్టిక్ ట్యాంకులో గర్భ నిర్ధారణ కిట్‌లు, యాంటి బయోటిక్ ఆంపిల్స్, సిరంజిలను పడవేశారు. ఆసుపత్రికి అభివృద్ధికమిటీ లేకపోవడంతో ఆరునెలల క్రితం ఎలాంటి అనుమతులు లేకుండా లక్షలాది రూపాయలు వెచ్చించి ఈ మందులను కొనుగోలు చేశారు. కాలం చెల్లడానికి ఆరు నెలల ముందే ఈ మందులను కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. రోగులకు ఈ మందులను వినియోగించకుండానే వీటిని కాల్చివేశారు. ఆసుపత్రికి చెందిన ఓఉన్నతాధి కారి బలవంతంగా రికార్డులు రాయించారనే ఆరోపణలున్నాయి. ఓ కిందిస్థాయి ఉద్యోగి తాను ఇండెంట్ రాయలే నంటూ మొర పెట్టుకుని సెలవులో వెళ్లిపోయారు. ఈ మందుల గోల్‌మాల్‌పై ఇటీవల డీఎంహెచ్‌వో కూడా విచారణ జరిపినట్టు తెలుస్తోంది. రూ.35లక్షల విలువలగల మందుల కొనుగోళ్లలో గోల్‌మాల్ జరిగినా ఇప్పటి వరకు దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానా లకు దారితీస్తోంది.


సెప్టిక్ ట్యాంకులో పడవేసిన మందులు

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షురాలిగా జ్యోతి


ఇమ్మడి జ్యోతి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షురాలిగా ఇమ్మడి జ్యోతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు నలుమాచు ప్రభాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం నిర్వహించిన సమా వేశంలో ఆమెను మహిళా మండల అధ్యక్షురాలిగా ఏకగ్రీవం చేయగా, ప్రధాన కార్యదర్శిగా యాంసాని జయ, కార్యవర్గ సభ్యులుగా తంగళ్లపల్లి వనజ, గుల్బం శారద, గుల్బం మంజుల, కోలేటి జ్యోతి, దేశి సుజాత, గుల్బం లతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

- ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రారంభంకానున్న క్రీడా పండుగ
- అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు క్రీడలు


కబడ్డీ ఆడుతున్న బాలికలు(ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయిలో పాఠశాలల క్రీడా సమాఖ్యల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఎస్‌జీఎఫ్ క్రీడలు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్నాయి. మండల, జోన్ స్థాయిలో పోటీలు గత నెల ప్రారంభమై ఈ నెల 14న ముగిశాయి. ముఖ్యంగా ఉమ్మడి జిల్లా స్థాయిలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలను మండలస్థాయిలో నిర్వహించారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లోని మైదానాలు విద్యార్థులు, క్రీడలతో కిక్కిరిసిపోయాయి. మండల స్థాయిలో ఈ పోటీల నిర్వహణతో క్రీడా పండుగను తలపించాయి. కొన్ని మండలాల్లో క్రీడలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించగా, మరికొన్ని మండలాల్లో నిధుల కొరతతో ఎంపిక పోటీలను మాత్రమే కన్వీనర్లు నిర్వహించారు. కొన్ని మండలాల్లో క్రీడలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించగా, మరికొన్ని మండలాల్లో నిధుల కొరతతో ఎంపిక పోటీలను మాత్రమే కన్వీనర్లు నిర్వహించారు.

● ఉమ్మడి జిల్లాస్థాయి వారీగా నిర్వహించే క్రీడలు..

పెద్దపల్లి జిల్లాలో అండర్-14, 17 విభాగాల్లో స్విమ్మింగ్, టెన్నిస్, సైక్లింగ్, బ్యాడ్మింటన్, కరాటే, అండర్-14 విభాగంలో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లాలో అండర్-14, 17 విభాగాల్లో అథ్లెటిక్స్, ఆర్చరీ, బేస్‌బాల్, బీచ్ వాలీబాల్, బాక్సింగ్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్, హాకీ, జూడో, కలరియ పట్టు, ఖురాష్, మాల్కంబ్, మోడ్రన్ పెంటాథ్లాన్, నెట్ బాల్, రగ్బీ, సెపక్ తక్రా, షూటింగ్, స్కేటింగ్, సాఫ్ట్‌బాల్, స్క్వాష్, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, యోగాసన క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అండర్-14, 17 విభాగాల్లో హ్యాండ్‌బాల్, అండర్-17 విభాగంలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించనున్నారు. జగిత్యాల జిల్లాలో అండర్-14, 17 విభాగాల్లో తైక్వాండో, బాస్కెట్‌బాల్, చెస్, ఖో-ఖో క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించనున్నారు.

శనివారంతోపాటు అన్ని మండలాల్లో క్రీడా పోటీలు ముగియడంతో జిల్లా స్థాయి, ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు క్రీడా షెడ్యూల్‌ను సిద్ధం చేశారు. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగి త్యాల జిల్లాల పాఠశాలల క్రీడా సమాఖ్యల కార్యదర్శులు క్రీడల నిర్వహణకు ఇటీవల సమా వేశమయ్యారు. ఈ సమావేశంలో ఏ జిల్లాలో ఏయే క్రీడల్లో పోటీలు నిర్వహించాలో, జిల్లా స్థాయిలో, ఉమ్మడి జిల్లాస్థాయిలో నేరుగా పోటీలను నిర్వహించే క్రీడలను ఎంపిక చేశారు. ఎక్కువ ఆదరణ ఉన్న కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, అథ్లెటిక్స్‌లో మొదటగా జిల్లాలో పోటీలను నిర్వ హించి అనంతరం ఉమ్మడి జిల్లాస్థాయి పోటీ లను నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జట్లను ఎంపిక చేయనున్నారు. మిగిలిన క్రీడల్లో నేరుగా ఉమ్మడి జిల్లాలో పోటీలను నిర్వహించి ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేయ నున్నారు. ఈ మేరకు జిల్లాస్థాయిలో, ఉమ్మడి జిల్లాస్థాయిలో నిర్వహించే క్రీడల జాబితాను ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు బి వేణుగోపాల్ (కరీంనగర్), శ్రీనివాస్ (రాజన్న సిరిసిల్ల), చక్రధర్ (జగిత్యాల), లక్ష్మణ్ (పెద్దపల్లి) ప్రకటించారు.


ఖో-ఖో ఆడుతున్న బాలురు(ఫైల్)

● జిల్లాస్థాయిలో నిర్వహించే క్రీడలు...

శనివారంతో వివిధ మండల స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణ ముగియడంతో ఆదివారం నుంచి జిల్లాస్థాయి పోటీలను నిర్వహించడానికి ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు ప్రణాళికలను సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ఆదివారం కరీంనగర్‌లో అండర్-17 వాలీబాల్ పోటీ లను బాలిబా లికలకు నిర్వహించ నున్నా రు. మిగిలిన జిల్లాల్లోనూ జిల్లా స్థాయి పోటీలను పలు క్రీడాంశాల్లో నిర్వహించ నున్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, అథ్లెటిక్స్, బ్యాడ్మి ంటన్, క్రికెట్, హ్యాండ్ బాల్, చెస్, కరాటే, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో అండర్-14, 17 విభాగాల్లో బాలబా లికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహించనున్నారు.

క్రీడా నైపుణ్యాల ప్రదర్శనకు ఉత్తమ వేదిక...

- నందెల్లి మహిపాల్, ఒలంపిక్ సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



పాఠశాలల స్థాయిలో క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఎస్‌జీఎఫ్ క్రీడలు ఒక వేదికగా పని చేస్తాయి. ఎస్‌జీఎఫ్ క్రీడలకు పూర్వవైభవం వస్తుంది. క్రీడలను ఘనంగా నిర్వహించి రాష్ట్ర పోటీల్లో పాల్గొనే ఉత్తమ ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేయాలి.

రాష్ట్ర పోటీల్లో చాంపియన్స్‌గా నిలవాలి...

- గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఒలంపిక్ సంఘ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉమ్మడి జిల్లాస్థాయిలో పాఠశాలల క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శనను చూపించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలి. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు చాంపియన్స్‌గా నిలవాలి. పోటీలను ఘనంగా నిర్వహించి విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలి.

పోటీల నిర్వహణకు నిధులను కేటాయించాలి...

- బి వేణుగోపాల్, ఎస్‌జీఎఫ్ కరీంనగర్ కార్యదర్శి



జిల్లా, రాష్ట్రస్థాయిలో పాఠశాలల క్రీడల నిర్వహణకు నిధులు సరిపోవడం లేదు. మండల స్థాయి పోటీల నిర్వహణకు అధిక మొత్తంలో నిధులు కావాలని కన్వీనర్లు కోరుతున్నారు. పోటీలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులను పాఠశాలల క్రీడా సమాఖ్యకు కేటాయించాలి. అప్పుడే ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ సాధ్యమవుతుంది. రాష్ట్ర స్థాయి పోటీలకు గతంలో వెచ్చించిన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



పథకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కోరుట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి తైక్వాండో కరాటే పోటీలకు కోరుట్ల నియోజకవర్గంలోని విద్యార్థులు ఎంపికైనట్లు టైక్వాండో క్లబ్ వ్యవస్థాపక పట్టణ అధ్యక్షుడు న్యాయం రమేష్ ఆదివారం తెలిపారు. ఇటీవల గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు చెందిన 22 మంది విద్యార్థులు పాల్గొని నాలుగు స్వర్ణ, ఆరు రజత, ఏడు కాంస్య పథకాలు సాధించినట్లు రమేష్ తెలిపారు. ఇందులో ఆరుగురు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాయిబలేరిలో నవంబరు 7వ తేదీన జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొనున్నట్లు రమేష్ తెలిపారు. విద్యార్థులను తైక్వాండో అసోసియేషన్ సభ్యులు కురవ శ్రీహరి, శ్రీనివాస్, సంతోష్ కుమార్ అభినందించారు.

పోలీసుల అదుపులో యువకుడు?

ఇల్లంతకుంట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : బాలిక ప్రైవేట్ వీడియోలు షేర్‌చేసిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఇల్లంతకుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(14)కు చెందిన ప్రైవేట్ వీడియోలను ఓ యువకుడు సోషల్‌మీడియాలో షేర్ చేశాడు. విషయాన్ని తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడిపై పోలీసులు పోక్సోతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

క్షణికావేశంతో మహిళ ఆత్మహత్యాయత్నం..

● చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్‌లో కుటుంబకలహాలతో క్షణికావేశానికి గురై మహిళ ఆత్మహత్యాయత్నానికి యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఓరుగంటి భారతి (52) ఈ నెల 12న కుటుంబసభ్యులతో గొడవ జరిగింది. దీంతో క్షణికావేశానికి లోనైనా భారతి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగగా, కుటుంబ సభ్యు లు వెంటనే హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి భర్త ఓరుగంటి వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

భర్త చేతిలో భార్య హతం

రామగిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లే ప్లాట్స్‌లో భర్త చేతిలో భార్య హత్యకు గురైన ఘటనలో సెంటినరీకాలనీలో సంచలనం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. 13 సంవత్సరాల క్రితం రమాదేవిని కృపాకరం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. తరుచూ నెలకొంటున్న తగదాల కారణంగా పూసల రమాదేవి సంవత్సర కాలంగా భర్తకు దూరంగా మంచిర్యాలలోని తనతల్లి ఇంట్లో ఉంటోంది. కాగా ఇరువురి మధ్య ఓ పాస్టర్ మధ్యవర్తిత్వంతో ఆదివారం వకీల్‌పల్లేలో ఉంటున్న అత్తగారింటికి పూసల రమాదేవి(40) చేరుకుంది. ఈ క్రమంలో భర్త కృపాకరం, రమాదేవి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మాటామాటా పెరిగి ఇంటినుంచి బయటకు వస్తున్న భార్య రమాదేవిని వెంబడించిన కృపాకరం కత్తి, చిన్న గడ్డపారతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రమాదేవి తీవ్ర రక్తస్రావంతో ఇంటి ముందు గల సిమెంట్ రోడ్డుపై పడి ప్రాణాలను కోల్పోయింది. సమాచారం అందుకున్న ఏసీపీ రమేశ్, సీఐ ప్రసాద్‌రావు, ఎస్‌ఐ శ్రీనివాస్ ఘటనస్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య


హారిక (ఫైల్)

మల్యాల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక మల్యాల మండలం రామన్నపేటకు చెందిన చెందిన ఒడిగ హారిక(17) అనే బాలిక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలి పిన వివరాల ప్రకారం హారిక ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కొద్దిరోజులుగా హారిక కడుపునొప్పితో బాధపడుతుండగా ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


తిరుపతి(ఫైల్)

మల్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక మల్యాలకు చెందిన గడుగు తిరుపతి(48) అనే వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆదివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తిరుపతి కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులతో పాటు ట్రాక్ట ర్ కొనుగోలు చేయగా నష్టం రావడంతో శనివారం క్రిమిసంహారక మందు తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

పెగడపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మోదుంపల్లి (మల్లారపు) సుప్రియ(27) అనే మహిళ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుప్రియ కొంతకాలంగా థైరాయిడ్ మరియు జాండిస్ వ్యాధితో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 12న ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు మృతురాలు తండ్రి మోదుంపల్లి అంజయ్య ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృత్యువాత

పెగడపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బతికెపల్లి గ్రామ శివారులో ఆదివారం విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన పర్శ రాజయ్యకు చెందిన గొర్రెలు ఆదివారం మేతకు వెల్లగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్లకు తగిలి విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డాయి. వాటి విలువ దాదాపు 25,000 రూపాయలు ఉంటుందని ప్రభుత్వ పరంగా పరిహారం అందించాలని బాధితుడు రాజయ్య వాపోయాడు.

వ్యక్తి అదృశ్యం


శంకర్

సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన సూత్రం శంకర్(33) అనే వ్యక్తి నాలుగు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. టౌన్ ఎస్‌ఐ వినీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన శంకర్ ఈనెల 10న ఇంటి నుంచి బయ టకు వెళ్లి తిరిగి రాలేదు. నాలుగు రోజులుగా శంకర్ జాడకోసం బంధువులు, స్నేహితులు, ఇతర ప్రాంతాల్లో వెతికినా కనిపించలేదు. తన కుమారుడు శంకర్ కనిపించడం లేదని తల్లి మనీషా ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ తెలిపారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి - ఉమ్మడి జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కాంగ్రెస్ నాయకుడు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోలర్ స్కేటింగ్ క్రేజీ క్రీడ అన్నారు. అమెరికా, బ్రిటన్, జర్మనీలో చాలా ప్రాముఖ్యం ఉందని, మన దేశంలో ఈ క్రీడను ఇటీవల కాలంలో ఎక్కువ మంది ఎంపిక చేసుకుంటున్నారని అన్నారు. శ్రమ, పట్టుదలతో నిత్య శిక్షణలో పాల్గొంటే రోలర్ స్కేటింగ్‌లో రాణించవచ్చన్నారు. జిల్లా రోలర్ స్కేటింగ్ అధ్యక్షుడు గట్టు అనిల్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఈ పోటీలను రెండురోజులపాటు 5 నుంచి 7 సంవత్సరాలు, 7 నుంచి 9 సంవత్సరాలు, 9 నుంచి 11 సంవత్సరాలు, 11 నుంచి 14 సంవత్సరాల విభాగాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిభచాటే క్రీడాకారులను హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు వీరన్న, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రోలర్ స్కేటింగ్ పోటీల విజేతలతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్‌రెడ్డి, క్రీడాకారులతో జిల్లా స్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు గట్టు అనిల్ కుమార్‌గౌడ్ తదితరులు

బిర్లా ఓపెన్ మైండ్స్‌లో రోలర్ ఈవెంట్ పోటీలు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్‌నేషనల్ పాఠశాలలో ఉమ్మడి జిల్లా రోలర్ స్కేటింగ్‌లో భాగంగా రోడ్ ఈవెంట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా స్కేటర్ అసోసియేషన్ అధ్యక్షుడు గట్టు అనిల్‌కుమార్ గౌడ్, ఉపాధక్షుడు డి.వీరన్న, కార్యదర్శి కృష్ణమూర్తి గౌడ్, కోచ్ సాయి నరహరి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో స్కేటింగ్‌ను ప్రోత్సహించేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. విజేతలు రాబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో శనివారం రాత్రి గ్రామానికి చెందిన భూపతి వెంకటరమణ ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఆదివారం తెల్లవారు జామున చూసేసరికి వాహనం కనిపించలేదు. సీసీ ఫుటేజ్‌లో పరిశీలించగా ఎవరో తీసుకువెళ్లినట్లు కనబ డింది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఒకరిపై న్యూసెన్స్ కేసు నమోదు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని వాణీనగర్‌లో శనివారం అర్ధరాత్రి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ రోడ్డుపై తల్వార్‌తో కేక్ కట్‌చేసిన కోరుంటి సాయి కృష్ణ అనే వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. రోడ్డుపై పబ్లిక్ న్యూసెన్స్ చేసినందుకుగాను సాయికృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి కోసం పోలీసుల వేట

- పలు ఇళ్లు, కిరాణా షాపుల్లో సోదాలు


సోదాలు చేస్తున్న ఎస్‌ఐ లక్ష్మణ్

వీర్నపల్లి(ఎల్లారెడ్డి పేట), సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు, రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. యువత కదలికలను గమనిస్తూ ముందుకు సాగుతున్నారు. వీర్నపల్లి మండలంలోని పల్లెల్లో ఎండు గంజాయి అమ్మకాలు అధికమవడంతో ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు వేటను ప్రారంభించారు. ఆదివారం కంచర్ల గ్రామంలోని అనుమానితుల ఇళ్లు, కిరాణా షాపుల్లో సోదాలు నిర్వహించారు. పరిసరాలను తనిఖీ చేశారు. ఇళ్లు, కిరాణా కొట్టుల్లో అణువణువుగా పరిశీలించారు. పలువురిని విచారించారు. గంజాయి విక్రయాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ లక్ష్మణ్ హెచ్చరించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వన్ టౌన్ సమీపంలోని ఓ హోటల్ వద్ద గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన బండార శ్రీనివాస్ అనే యువకుడు ఆదివారం ఎలుకల మందుతాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు, ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు స్నేహితులు తెలిపారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

లక్ష అడ్వాన్స్ ఇస్తే రూ. ఐదు లక్షల అప్పు

- నిజామాబాద్ మహిళా వడ్డీ వ్యాపారుల ఆఫర్లు - అడ్వాన్స్‌లు తీసుకుని స్పందించని మహిళా గ్రూప్ - ఆందోళనలో బాధితులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమకు గల్ఫ్ దేశాల నుంచి పెద్ద మొత్తంలో సంపాదన ఉందని.. తక్కువ వడ్డీకే అప్పులు ఇస్తామంటూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన కొందరు మహిళలు గ్రూప్‌గా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వసూళ్లు మొదలుపెట్టారు. ఇక్కడ ఒకరిద్దరు ఏజెంట్లను పెట్టుకుని లక్ష అడ్వాన్స్ ఇస్తే ఐదు లక్షల రూపాయల అప్పు ఇస్తామంటూ ఆఫర్ పెట్టారు. ముఖ్యంగా సింగరేణి కార్మికులే లక్ష్యంగా ఈ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆర్‌జీ-1 ఏరియాకు చెందిన ఒక ప్రముఖ కార్మిక సంఘం పిట్ సెక్రెటరీతో పాటు గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీకి చెందిన కొందరు ఉద్యోగులు వీరికి అడ్వాన్స్‌లు ఇచ్చినట్లు తెలుస్తున్నది. 50,000 రూపాయల చొప్పున ఇచ్చిన ఒకరిద్దరికి డబ్బులు పంపిన సదరు గ్రూపు మిగతా లక్షల్లో అడ్వాన్స్ ఇచ్చిన వారికి స్పందించడం లేదు. దీంతో సదరు బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం నిజామాబాద్ ప్రాంతానికి వెళ్లిన బాధితులకు వడ్డీ వ్యాపారస్తుల ఆచూకీ లభించకపోవడంతో వెనుదిరిగినట్టు తెలుస్తున్నది. ఇప్పటికే నానారకాల మోసాలతో ఆర్థికంగా నష్టపోయిన రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కార్మిక కుటుంబాలపై మహిళా వడ్డీ వ్యాపారుల పేర కొందరు డబ్బులు వసూలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది. కాగా గోదావరిఖని పట్టణంలోని ఒక ప్రైవేట్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో ఇదేతరహాలో ఎక్కువ వడ్డీ వస్తుందని ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయగా మెచ్యూరిటీ సమయంలో డిపాజిట్‌దారులకు సంబంధం లేకుండా మేనేజరే సుమారు 70లక్షల రూపాయల వరకు డిపాజిట్లపై రుణాలు తీసుకున్న ఉదంతం వెలుగు చూసింది. బాధితులు సదరు బ్యాంకు కేంద్ర కార్యాలయం మహారాష్ట్రకు వెళ్లి ఫిర్యాదు చేయగా విచారణ పేర జాప్యం చేస్తున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు మహిళా వడ్డీ వ్యాపారుల పేర కొందరు రామగుండంలో అడ్వాన్స్‌లు వసూలు చేయడం చర్చనీయాంశం అయ్యింది.

బ్యాంక్ లోన్ అధికారినంటూ ఫోన్ కాల్

రూ.1.25 లక్షలు మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాను బ్యాంక్ లోన్ అధికారినంటూ ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని ఓ వ్యక్తికి ఫోన్ కాల్ చేసి ఐదు లక్షల రూపాయలు రుణం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. వెంకటాపూర్‌లోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ చేసి తాను బ్యాంకు లోన్ అధికారినని పరిచయం చేసుకుని రుణం ఇప్పిస్తానని నమ్మించాడు. బాధితుడి నుంచి ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.1.25 లక్షలు విడతల వారీగా వసూలు చేశాడని చెప్పారు. రుణం మంజూరు కాకపోవడంతో సదరు వ్యక్తి ఫోన్ నంబర్‌కు కాల్ చేయగా స్పందన లేకుండాపోయిందని పేర్కొన్నారు. తాను మోసపోయనని గ్రహించిన బాధితుడు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు. సైబర్ నేరాలకు గురైతే బాధితులు 1930 నంబర్‌కు కాల్ చేసి వివరాలను నమోదు చేయాలని సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి సూచించారు.

గడగడపకు బీసీ భావజాలాన్ని తీసుకెళ్తాం

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బీసీ భావజాలాన్ని గడపగడపకు తీసుకెళ్తామని, 42 శాతం రిజర్వేషన్‌లు అమలయ్యేవరకు పోరాటం చేయాలని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో 'ఇస్సా-ఇజ్జత్-ఉకుమత్' అంశాలపై నిర్వహించిన బీసీల రాజ్యాధికార సభలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను ఐక్యం చేసేందుకు సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 75 ఏళ్లుగా బీసీలు నష్టపోతున్నారని, ఇకనైనా మేలుకొని హక్కులు సాధించుకోవాలని అన్నారు. గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో కులగణన చేయాలని డిమాండ్ చేశామని, ప్రభుత్వం దిగివచ్చి కులగణన చేపట్టిందని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం 9వ షెడ్యూల్‌లో పొందుపర్చాలన్నారు. బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఉరుమల్ల విశ్వం మాట్లాడుతూ రాబోయే అన్ని ఎన్నికల్లోనూ బీసీల గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తాం అన్నారు. ఎమ్మెల్సీ కంటెస్టెడ్ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మాట్లాడుతూ రానున్నది బీసీల రాజ్యమేనన్నారు. బీసీ నాయకులు సబ్బని వెంకట్, కరీంనగర్ జిల్లా బీసీఐఎఫ్ నాయకుడు ఇప్పనపెల్లి సాంబాన్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

అక్రమంగా తరలిస్తున్న యూరియా వాహనం పట్టివేత

మానకొండూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని ప్రైవేట్ కంపెనీ నుంచి అక్రమంగా 50 యూరియా బస్తాలను తరలిస్తున్న వాహనాన్ని శనివారం రాత్రి మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పట్టుకున్నారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న ప్రైవేట్ కంపెనీ నుంచి 50 యూరియా 50 ఎఫ్ 20 బస్తాలను మినీ గూడ్స్ వాహనంలో లోడ్ చేసి హన్మకొండ జిల్లా పరకాలకు తరలిస్తుండగా స్థానికులు గమనించి వ్యవసాయ అధికారికి సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న వాహనాన్ని తనిఖీ చేసి సీజ్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఏవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దుకాణంలో ఉన్న స్టాక్ రిజిష్టర్‌లను తనిఖీ చేయగా సక్రమంగా లేవని తెలిపారు. దీంతో 1952 ఎరువుల బస్తాలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

వారంలో ఐదు రోజులు తిరుపతికి ప్రత్యేక రైళ్లు

పెద్దపల్లి, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నుంచి వారానికి ఐదు రోజులపాటు ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతికి రైలు సౌకర్యం ఏర్పడింది. తాజాగా నాందేడ్ నుంచి తిరుచానూర్‌వరకు తిరుపతి మీదుగా రైలు నడవనున్నది. ఆది, గురువారాల్లో కరీంనగర్ నుంచి తిరుపతికి నంబర్ 12762 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తున్నది. దీనికి తోడు మంగళవారం నాందేడ్ నుంచి తిరుచానూర్‌కు రైలు నంబర్ 07039వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడవనున్నది. ప్రతీ శుక్రవారం రైలు నంబర్ 07189నాందేడ్ నుంచి ధర్మవరం వరకు నడుస్తున్నది. ప్రతీశనివారం రైలు నంబర్ 07015 నాందేడ్ నుంచి తిరుపతి వరకు వీక్లీ ఎక్స్‌ప్రెస్ నడుస్తున్నది. సోమ, బుధవారాల్లో ఈ ప్రాంతం నుంచి తిరుపతికి రైలు సౌకర్యం లేదు. ఈ రైళ్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి జంక్షన్, జమ్మికుంట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం ఉంది. ఇవేగాకుండా ఈనెల 23నుంచి అదనంగా ప్రతీ గురువారం మధ్యాహ్నం 12:45గంటలకు పెద్దపల్లి జంక్షన్ మీదుగా చర్లపల్లి నుంచి తిరుపతి వరకు పొడిగించిన రక్సల్ నుంచి తిరుపతికి వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి రానున్నది. తిరుపతికి వెళ్లే భక్తులకు వారంలో ఐదు రోజులు రైళ్లు అందుబాటులోకి రావడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి ప్రవాహం



ధర్మపురి వద్ద కొనసాగుతున్న గోదావరి నది నీటి ప్రవాహం

ధర్మపురి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం ఆదివారం పెరిగింది. గోదావరి ఎగువ మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. దీనికి తోడుగా తెల్లవారుజామున నుంచి ఎస్ఆర్ఎస్‌పీ, కడెం ప్రాజెక్టు నుంచి నీరు దిగువ గోదావరి నదిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణక్షణం పెరిగి నీటి ప్రవాహం వేగంగా కొనసాగింది. ప్రస్తుతం సంతోషీమాత దేవాలయం, శ్రాద్ధ మండపం, నదీ స్నానఘట్టాలు అనుకుని నీరు ప్రవహిస్తోంది. స్నానం చేసే భక్తులను గోదావరి నదీ లోతు ప్రదేశంలోనికి అనుమతించడం లేదు. రైతులు, వ్యవసాయ కూలీలు, నదిలో చేపలు పట్టడం కోసం వెళ్లే మత్స్యకార్మికులకు లోతు ప్రదేశాలకు వెళ్లరాదని సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, రవికుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరికలు జారీ చేశారు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మా కోల్..

- నేటి నుంచి బొడ్డెమ్మ సంబురాలు
- 21నుంచి ఎంగిలి పూల బతుకమ్మ
- ఆడ పడుచులు పుట్టింటికి వచ్చే వేళ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

తీరొక్క పూలతో తొమ్మిది రోజుల పాటు ప్రకృతితో మమేకమై.. పూల జాతరగా మారే తెలంగాణ సంప్రాదాయిక బతుకమ్మ పండుగ కోసం ఆడపడుచులందరూ ఎదురుచూస్తారు. ఎంతో ఉత్సాహంగా సాగే బతుకమ్మ సంబురాల కంటే ముందు బొడ్డెమ్మ ముందుకు వస్తోంది. పెత్రమాస నుంచి ఎంగిలిపూల బతుకమ్మ మొదలవుతే



బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

అంతకంటే ముందు ఇళ్లవద్దే పిల్లలు, యువతులు ఆడుకునే బొడ్డెమ్మ ఆటపాట సోమవారం నుంచి వినిపించనుంది. ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తొమ్మిది రోజుల ముందు, ఎక్కువ ప్రాంతాల్లో ఏడు, ఐదు రోజుల నుంచి బొడ్డెమ్మ పండుగ మొదలవుతుంది. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగను గుర్తించి ఈనెల 21 నుంచి 30 తేది వరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇదే క్రమంలో బొడ్డెమ్మను గుర్తించకపోవడంతో చిన్నబోతోంది. ఈ నేపథ్యంలోనే బొడ్డెమ్మ సంస్కృతి కనుమరుగయ్యే ప్రమాదంలో పడింది. సోమవారం నుంచి బొడ్డెమ్మ పండుగ ప్రారంభం కానుంది. ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లో బొడ్డెమ్మ సంస్కృతి పదిలంగానే ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు వేములవాడ, ఇతర మండలాల్లో బొడ్డెమ్మను ఆడుకుంటున్నారు.

● బొడ్డెమ్మా... బొడ్డెమ్మా బిడ్డలు ఎందరే...

బొడ్డెమ్మ బొడ్డెమ్మా కోల్.. బిడ్డలు ఎందరే.. అంటూ చిన్నారులు ప్రధానంగా బొడ్డెమ్మా ఆటలు ఆడుకుంటారు. బొడ్డెమ్మ అనే పదాన్ని అమ్మవారి నామాలతో ఒక నామంగా గుర్తించి బొడ్డెమ్మను పుట్టమన్నుతో చిన్నపిల్లలు, కన్నెపిల్లలు కలిసి ఒక పీటపైన ఎర్రమట్టితో అంతస్తు లుగా, గుండ్రంగా బొడ్డెమ్మను తయారు చేస్తారు. పీట మీద తయారుచేసి మట్టిపైనా శిఖరంగా బీర, కట్ల, గన్నేరు, నందివర్ధనం వంటి పూలతో బొడ్డెమ్మ ప్రతిరోజు అలికి అలంకరించి రోజూ ఆటలాడి తొమ్మిది రోజుల పాటు ఇళ్లలోనే ఉంచి చివరి రోజు చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేస్తారు. ప్రతి రోజు సాయంత్రం అలం కరించి.. దూపదీప నైవేద్యాలతో అర్చిస్తూ... బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ కోలాటం ఆడుతారు. బొడ్డెమ్మ పాటల్లో చందమా మను కలుపుతూ... పాడుకోవడం ప్రధానంగా కనిపిస్తుంది. బొడ్డెమ్మ తరువాత వచ్చే అమావాస్య నుంచి మహిళలు బతుకమ్మ సంబరాలను ప్రారంబి స్తారు. బొడ్డెమ్మ సంబురాల తరువాత మరుసటి రోజు పెత్ర అమావాస్య నుంచి చిన్న బతుకమ్మ సంబరాలు మొదలై పెద్ద బతుకమ్మతో ముగుస్తాయి. ఈసారి ఈనెల 21వ తేదిన అమవాస్య వస్తుండడంతో ఎంగిలిపూల బతుకమ్మ మొదలు కానుంది. పెద్ద బతుకమ్మ ఈనెల 30న జరుపు కోనున్నారు.



● ఆడపడుచులు ఎదురుచూసే సంబరం

తంగేడు పువ్వు ముచ్చట్లు.. గునుగు పువ్వు సంబరాలు.. మధ్య ఆడపడుచులు పుట్టింటికి తరలి వచ్చే ఆనందోత్సాహం. తెలంగాణ జిల్లాల్లో ఆడపడుచులందరూ బతుకమ్మ పండుగ ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తారు. బతుకమ్మ పండుగ అంటే మహిళలే కాదు ప్రకృతి కూడా పుకలరిస్తుంది. ఆడపడుచులు పుట్టింటికి వచ్చి సందడి చేసే బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. బతుకమ్మ పండుగ రోజులు పల్లెబాటలకు ఇరువైపులా.. పసుపు పారబోయిసినట్లుగా తంగేడు.. ఏ దిక్కున చూసినా పలకరించే కట్ల పూలు, ప్రతి ఇంటి గడప ముందు కనిపించే మందారాలు, తలుపు సందుల్లో తొంగి చూసే గన్నేరు.. నేలంతా పరుచుకునే గుమ్మడి... ఇలా తీరొక్క రంగుల పూలతో పడుచుల్లో ఆనందాన్ని నింపుతాయి. బతుకమ్మను ఆదిశక్తిగా పల్లెపల్లెలో ఏ తారతమ్యాలు లేకుండా ఆడపడుచులు జరుపుకుంటారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మను మహిళలు తొమ్మిది రోజులపాటు జరుపుకుంటే.. మగవారంతా తంగేడు, గునుగు పూలను పచ్చిక బయల్లలోంచి సేకరించి తీసుకొస్తారు. ఇంటిల్లిపాది ఎంతో ఉత్సాహంగా బతుకమ్మను పేరుస్తారు. ఇలా చివరి రోజున పెద్ద బతుకమ్మ పేర్చి కొత్త బట్టలు ధరించి గౌరిదేవిని కీర్తిస్తూ ప్రధాన కూడలి వద్ద ఆడపడుచులు బతుకమ్మ ఆటపాట ఆడుతారు. చీకటి పడుతున్న వేళ ఊరి శివారులోని వాగులు, చెరువుల వద్దకు ఊరేగింపుగా తీసుకొని వెళుతారు. బతుకమ్మ బతుకమ్మ ఉయాల్లో... బంగారు గౌరమ్మ ఉయ్యాలో.. పడిపంటలను ఉయ్యాలో... సల్లంగా సూడమ్మ ఉయ్యాల్లో... అంటూ సాగిన బతుకమ్మకు శ్రీగౌరి నీపూజ ఉయ్యాలో... చేయగౌరితినమ్మ ఉయ్యాలో... జలజాక్షి పన్నీరు ఉయ్యాలో... జలకంబులాడంగ ఉయ్యాలో... సౌర పలుకుల పహ ఉయ్యాలో... నేరు తేలంబులు ఉయ్యాలో... నీతిరో నికిక ఉయ్యాలో... నిదురబో బొడ్డెమ్మ నిద్రబోవమ్మా... నిద్రకు నూరేళ్లు... నీకు వెయ్యేళ్లు... పాలిచ్చే తల్లికి వెయ్యేళ్లు... నినుగన్న తల్లికి నిండా వెయ్యేళ్ల అంటూ... పెద్ద బతుకమ్మకు వీడ్కోలు పలుకుతారు. రకరకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఆడపడుచులు పల్లెంలో తెచ్చిన నీటితో వాయినమమ్మా వాయినం.. అంటూ వాయినాలు ఇచ్చుకుంటారు.

బొడ్డెమ్మ పాట...

బొడ్డెమ్మ బొడ్డెమ్మా కోల్.. నీ బిడ్డ పేరేమీ కోల్..
నీ బిడ్డ పేరు నీలగౌరు కోల్..నిచ్చమల్ల చెట్టేసి కోల్..
నిచ్చమల్ల చెట్టుకు కోల్..రోజు నీళ్లు పోసి కోల్..
కాయల్లు పిందెల్లు కోల్..ఘనమైన కాతకాసే కోల్..
కాయలన్ని తెంపి కోల్..కడవల్లో పోసి కోల్..
పిందెలన్ని తెంపి కోల్..బిందెల్లో పోసి కోల్..
పండ్లన్ని తెంపి కోల్.. బండ్లల్లో పోసి కోల్..
అందులోని పండు తీసి కోల్.. ఢిల్లీకి పంపించి కోల్..
ఢిల్లీ డీప రాజు కోల్..మేడొకటి కట్టించే కోల్..
మేడలో ఉన్నది కోల్.. మేలు శ్రీగౌరి కోల్..
మేలుశ్రీగౌరికి కోల్.. ఏమేమీ నగలు కోల్..
పెసర కాయ బెబ్బర్లు కోల్.. ఒంటి నిండా సొమ్ము కోల్..
కందికాయ బెబ్బర్లు కోల్..కాళ్లకు కడియాలు కోల్..
అన్ని సొమ్ములు పెట్టి కోల్..అద్దంలో చూసే కోల్..

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ నీటిని దిగువ గోదావరికి విడుదల చేయడం కొనసాగుతోంది. ఆదివారం 22 గేట్లు పైకి ఎత్తి 89,680 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,07,395 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిడ్ మానేరులో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) ఆదివారం 2,800 ఇన్ ఫ్లో వచ్చింది. ఎస్సారెస్పీ నుంచి వరదకాలువ ద్వారా 7,600 మానేరు, మూలవాగు ద్వారా 600 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్యాకేజి 10 లోని అన్నపూర్ణ రిజ ర్వాయర్‌కు 6,400 ప్యాకేజి 9లోని మల్కాపేట రిజర్వాయర్‌కు 561 క్యూసె క్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు గాను ప్రస్తుతం 317.83 సామర్థ్యం 27.55 టీఎంసీలకు గాను 27.094 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లో..

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.98 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వచ్చిన 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీ గేట్ల మూసివేత

తిమ్మాపూర్(మానకొండూర్): ఎల్ఎండీ రిజర్వాయర్ గేట్లను ఆదివారం మూసివేశారు. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలకు గాను 23.387 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 4,309 క్యూసెక్కులు కాగా అంతేమొత్తంలో దిగువకు వదులుతున్నారు.

సైకిల్‌పై 108 వైష్ణవ ఆలయాల సందర్శన

- 22,000 కిలోమీటర్లు చుట్టివచ్చిన కొడిమ్యాల భక్తుడు



వైష్ణవ ఆలయాల దర్శనానికి సైకిల్‌పై వెళ్తున్న భక్తుడు నర్సింహ రామానుజదాసన్(ఫైల్)

కొడిమ్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన వెల్మ నర్సింహ రామానుజదాసన్(33) అలియాస్ సుదర్శన్‌రెడ్డి అనే యువకుడు దేశవ్యాప్తంగా సైకిల్‌పై 108 వైష్ణవ ఆలయాలను దర్శించుకున్నాడు. నర్సింహ రామానుజదాసన్ సైకిల్‌పై గత ఏడాది ఆగస్టు 23న సైకిల్‌పై యాత్ర ప్రారంభించి ఏడాది కాలంలో సైకిల్‌పై 22,000 కిలోమీటర్లు ప్రయాణించి వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశాడు. మండల కేంద్రానికి చెందిన వైష్ణవ భక్తులైన వెల్మ మల్లారెడ్డి-కాంతమ్మ దంపతుల చిన్న కుమారుడైన సుదర్శన్‌రెడ్డి డిగ్రీ వరకు చదువుకున్నాడు. చిన్నప్పటి నుంచి వైష్ణవ భక్తుడైన సుదర్శన్‌రెడ్డి రెండు సంవత్సరాల క్రితం చిన్న జీయర్‌స్వామి వద్ద ఉపదేశం పొంది తన పేరును వెల్మ నర్సింహ రామానుజదాసన్‌గా మార్చుకున్నాడు. అనంతరం సాత్విక ఆహారం భుజిస్తూ వైష్ణవ ఆలయాల దర్శనానికి సైకిల్‌పై బయలుదేరాడు. మొదట తమిళనాడులోని శ్రీరంగనాథస్వామి, కేరళలోని అనంత పద్మనాభస్వామి ఆలయం, ముక్తీనాథ్, బద్రీనాథ్, తిరుపతి వేంకటేశ్వరస్వామి, అహోబిలం లక్ష్మీనర్సింహ స్వామి ఆలయాలతో పాటు పలు విష్ణు దేవాలయాలను దర్శించుకున్నాడు. దేశంలోని 108ఆలయాలను దర్శించుకొని ఆదివారం కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామానికి చేరుకొని లక్ష్మీనర్సింహస్వామి దర్శనం చేసుకున్నాడు. అనంతరం కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం రాత్రి బసచేసి సోమవారం సాయంత్రం కొడిమ్యాలకు రానున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా బొమ్మకల్ శివారులో వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. బొమ్మకల్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సిరిసిల్ల అజయ్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ

రాయికల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయంలో శనివారం రాత్రి దుండగుడు హుండీని పగులగొట్టి అందులోని డబ్బులను ఎత్తుకెళ్లాడు. ముఖానికి మాస్క్ పెట్టుకుని వచ్చిన ఆ వ్యక్తి గుడి హుండీని పగులగొటి దోచుకు వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో రాజన్న దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని పార్వతిరాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం గండాలు తొలగిపోవాలని గండాదీపంలో నూనె పోశారు. భక్తులు పరివార దేవాలయాలను సందర్శించి కుంకుమ పూజ, శివకల్యాణం, సత్యనారాయణ వ్రతం పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

● ధర్మపురి నరసింహుడి సన్నిధిలో...



ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి సన్నిధి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఆలయంలో అభిషేకం, అర్చన, హోమం, నిత్య కల్యాణం నిర్వహించారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య, నంబి నరసింహమూర్తి, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, రాజగోపాల్, సాయికుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో వృద్ధుడికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ఓ కాలనీలో వృద్ధుడిపై కోతులు దాడిచేశాయి. భార్యా భర్తలు తమ బంధువుల ఊరికి వెళ్లి ఆదివారం సాయంత్రం సుల్తానాబాద్ వచ్చారు. తమ ఇంటి వద్దకు చేరి భార్య తాళం తీస్తుండగా నిలబడి ఉన్న భర్త బోయ వెంకటరమణపై కోతులు దాడిచేశాయి. దీంతో కింద పడిపోయిన బోయ వెంకటరమణకు తలకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కోతుల బెడదను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

డాక్టర్ 'పత్తిపాక' అనువాద పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రధాని



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ, మోహన్ తెలుగులోకి అనువదించిన హజారికా పుస్తకం

సిరిసిల్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ గేయ రచయిత, బ్రహ్మపుత్ర కవి, గాయకుడు, భారతరత్న డాక్టర్ భూపేన్ హజారికా శతజయంతిని ఈ సంవత్సరమంతా అస్సాం ప్రభుత్వం నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఆంగ్లంతో పాటు 22 భారతీయ భాషల్లో భారతరత్న భూపేన్ హజారికా పుస్తకాన్ని ప్రచురించారు. ఒకే వేదికపై ప్రధాని నరేంద్రమోదీ ఆవిష్కరించారు. ఆదివారం గౌహతిలో జరిగిన భూపేన్ హజారికా శత జయంతి ప్రారంభ సభలో ప్రధానమంత్రి ఆవిష్కరించిన వాటిలో అస్సా మీలో అనురాధ శర్మ పూజారి రాసిన 400 పేజీల పుస్తకాన్ని తెలుగులో సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారగ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ అనువదించారు. ఒకే వేదికపైన భారతీయ భాషల ఇంద్రధనస్సులో సిరిసిల్ల రచయితకు చోటుదొరకడం, సిరిసిల్లకు చెందిన అనువాద కుడి పుస్తకాన్ని ప్రధాని ఆవిష్కరించడంపై రయితలు, కవులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మల్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో జరిగిన 34వ జిల్లా అసోషియేషన్ కబడ్డీ సబ్ జూనియర్ ఎంపిక పోటీల్లో మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. మనీషా, మేఘన, హారిక, తేజస్విని, సౌమ్య, లక్ష్మీప్రసన్న, యశస్విని ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు.



పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థులు

రాతియుగపు పరిశోధకుడు రాజారామ్ సింగ్

- తన ఇంటినే మ్యూజియంగా మార్చిన చరిత్రకారుడు
- నేడు ఠాకూర్ రాజారామ్ సింగ్ జయంతి..

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాతియుగపు ఆనవాళ్లను పరిశోధిస్తూ అంతర్జాతీయంగా ఎందరో పరిశోధకులకు మార్గదర్శకంగా నిలిచిన ప్రముఖ ఆర్కియాలజిస్టు ఠాకూర్ రాజారాంసింగ్(అమరభారతి) చరిత్రపుటల్లో నిలిచారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా క్విట్ ఇండియా ఉద్యమంలో కీలకపాత్ర వహించిన ఆయన న్యాయవాదిగా అందరికీ తెలుసు. ఆర్కియాలజిలో అద్భుతాలు సాధించి, దేశవిదేశాల రీసెర్చ్ స్కాలర్స్ మన్ననలు పొందారు. రాజారాంసింగ్ 1928సెప్టెంబరు 15న పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని



ఠాకూర్ రాజారాంసింగ్ గృహం

శివాలయం వీధిలో ఠాకూర్ నారాయణసింగ్, కృష్ణాబాయిలకు జన్మించారు. కవి, రచయిత, చరిత్ర పరిశోధకుడిగా రాణించారు. ఆయన స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ తిరస్కరించారు. అమరభారతి అనే కలం పేరుతో ఆంగ్లం, ఉర్దూ, తెలుగులో కవితలు, వ్యాసాలు రాశారు. శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం సంపుటిని ఉర్దూ, ఆంగ్లంలోకి అనువదించారు. శాతవాహనుల రాజధాని కోటిలింగాలను దాని నేపథ్యాన్ని శాతవాహనుల కాలంనాటి ఆనవాళ్లను, వారు ఉపయోగించిన పనిముట్లను పరిచయం చేశారు. గోదావరి పరివాహకం వెంట వెళ్లి రాతియుగం నాటి మనిషి ఆనవాళ్లు, పాదముద్రలను సేకరించారు. అలాగే రాకాసి బల్లి ఆనవాళ్లను మొదటిసారి సేకరించిన చరిత్రకారుడు. పెద్దబొంకూర్‌లో గల శాతవాహనుల చారిత్రక ఆనవాళ్లను నాణేలను సేకరించి ఆనాటిచరిత్రను వెలుగులోకి తీసుకువచ్చి, ఆంగ్లంలో ఒక పుస్తకంగా మలిచిన మహనీయుడు.

పెద్దబొంకూర్‌లోను అలాగే కోటిలింగాలలోను ఆయన పరిశోధన మేరకు అక్కడ తవ్వకాలు జరిపారు. తన ఇంటినే మ్యూజియంగా మార్చాడు. ఎందరో పరిశోధకులకు మార్గదర్శిగా నిలి చాడు. కోటిలింగాల తవ్వకాల్లో బయటపడిన వాటిని, అనేక పనిముట్లను తన మ్యూజియంలో భద్రపరిచారు. పెద్దబొంకూర్ నాణాలను సేకరించి బౌద్ధ జైనఆనవాళ్లను మన ముందుంచారు. ధూళికట్ట బౌద్ధస్తూపం ప్రత్యేకతను వివరించారు. ఈయన రచనలను ఏసోర్స్ ఆఫ్ మెటీరి యలిజం అనే పేరుతో ఆంగ్లంలో ఒక పుస్తకంగా తీశారు. ఆయన 2003జూలై 27న గుండెపోటుతో మరణించాడన్న వార్త సాహిత్యప్రపంచాన్ని కుదిపి వేసింది. ఆయన మరణవార్త సాహిత్య ప్రపంచాన్ని కుదిపివేసింది. ఎందరో పాశ్చాత్య ఆర్కియాలజిస్టులు ఇక్కడి చారిత్రక పరిశోధకుని ఇంటిని సందర్శించారు. మలయశ్రీ లాంటి మహానుభావులందరూ ఆయనతో ఉన్న పరిచయాలను ప్రజలకు సాహితీ ప్రపంచానికి వివరిస్తుంటే ఇంతటి గొప్ప మహనీ యుడు పెద్దపల్లి జిల్లాకేంద్రంలో ఉన్నారా అని అంటూ విస్తుపోయారు. ఇప్పుడు పెద్దపల్లి ప్రజల ముందున్న ఒకేఒక ప్రశ్న ఎల్లమ్మచెరువు ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, అలాగే పెద్దపల్లి జిల్లాకేంద్రంలో ఠాకూర్ రాజారాంసింగ్ మెమోరీయల్‌గా ఒక మ్యూజియం ఏర్పాటు చేసి ఆయన సేకరించిన ఆనవాళ్లను అందులో పొందుపర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఠాకూర్ రాజారాంసింగ్

ఆదర్శంగా నిలుస్తున్న పూర్వ విద్యార్థులు

● బాల్య మిత్రుల సేవా ట్రస్ట్ ఏర్పాటు ● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు


ఇటీవల కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వారంతా ఉన్నతవిద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాలు చేసిన వారే. మరికొందరు వ్యాపారులుగా, ఇంకొందరు రాజకీయంగా మంచి స్థితిలో ఉన్నారు. ఐదున్నర దశాబ్దాలక్రితం తాము చదువుకున్న పాఠశాలను ఆనాటి మిత్ర బృందమంతా ఒక్కచోట చేరి పూర్వ విద్యార్థుల కమిటీగా ఏర్పడ్డారు. రెండు మూడు సమావేశాల నిర్వహణ అనంతరం వారిలో మెదిలిన ఆలోచనతో వారంతా కలసి సుల్తానాబాద్ బాల్యమిత్రుల సేవా ట్రస్ట్‌ను నెలకొల్పారు. వివరాల్లోకి వెళితే.. సుల్తానాబాద్ ప్రభుత్వజూనియర్ కళాశాలలో 1979పదవ తరగతి, 1981ఇంటర్మీడియట్ విద్యను చదువుకున్న విద్యార్థులంతా ఓ కమిటీగా ఏర్పడ్డారు. 2017ఫిబ్రవరి 26న పూర్వవిద్యార్థులు 120మంది కలసి ఆత్మీయసమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకుని యాభై ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి తమచిన్ననాటి జ్ఞాపకాలను మధురమైన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ఇక్కడే వారికి ఓ ఆలోచన తట్టింది. పూర్వవిద్యార్థుల్లో ఒకరైన పోలీస్ శాఖలో ఎస్పీగా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతి ట్రస్ట్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. అంతా మద్దతు పలికారు. దీంతో ఉప్పు తిరుపతి గౌరవ అధ్యక్షుడుగా బాల్యమిత్రుల సేవాట్రస్టును 2018లో రిజిస్టర్ చేయించారు. కంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్న కోట లక్ష్మారెడ్డి అధ్యక్షుడిగా, పురం ప్రేమ్‌చందర్‌రావు ఉపాధ్యక్షుడుగా, ఊట్కూరి రాంమూర్తి ప్రధానకార్యదర్శిగా, కొమురవెల్లి సుదాకర్ కోశాధికారిగా, నీటి పారుదలశాఖ ఏఎ‌స్‌ఈ ముస్త్యాల కరుణాకర్, ఎంఈవో గోపు గంగాధర్ రెడ్డి, గాండ్ల చంద్రశేఖర్ సహాయకార్యదర్శులుగా, ప్రముఖ న్యాయవాది బాలకిషన్ ప్రసాద్ ముఖ్య సలహాదారులుగా ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తూ అనేక సేవా కార్యక్రమాలు ప్రారంభించారు.

● సేవా కార్యక్రమాలు..

రామడగు మండలం తిరుమలాపూరం గ్రామానికి చెందిన తల్లితండ్రి లేని ఓ పేదింటి యువతి వివాహాన్ని దాదాపు పదిలక్షల ఖర్చుతో జరిపించారు. పేద పిల్లలకు నోట్ బుక్కులు పాఠ్య పుస్తకాలు అందించారు. పలువురు యువకులకు ఉపాధికోసం ఆర్థిక సహాయం చేశారు. పలువురు తలసేమియా వ్యాధిగ్రస్తులకు రెడ్‌క్రాస్ వారిచే రక్త దాన శిబిరాలను ఏర్పాటుచేసి రక్తాన్ని సేకరించారు. అనేక వైద్య ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుచేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసౌకర్యాన్ని అందించారు. ఇలా వివాహాలకు వైద్యఖర్చులకు, ఉన్నత చదువులకు, పలువురు యువత ఉపాది కోసం అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

● సామాజిక సేవే లక్ష్యంగా..

ఉప్పు తిరుపతి,ఐపీఎస్ అధికారి, ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు



సామాజిక సేవేలక్ష్యంగా ట్రస్ట్‌ను ఏర్పాటు చేశాం. బాల్యమిత్రులంతా కలసి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేకసేవలు చేస్తున్నాం. ముఖ్యంగా పేదింటి అమ్మాయిల వివాహం, పేదల ఉన్నతచదువులకు, అత్యవసరాలకు స్పందిస్తూ బాధితులకు తామున్నాం అంటూ అండగా నిలుస్తున్నాం. పేదలు ఎవరైనా అత్యవసరమై ఆసుపత్రి పాలైతే వారి వైద్యఖర్చుల్లో కొంత అందిస్తున్నాం. ప్రతీఏటా సీజనల్‌వారిగా చలికాలంలో దుప్పట్లు బ్లాంకెట్లు ఎండకాలంలో చిరువ్యాపారులకు గొడుగులు ప్రజలకు చలివేంద్రాలు ఇలా తమకు తోచిన సాయాన్ని ట్రస్ట్ ద్వారా అందిస్తున్నాం.

● సేవల కోసం ముందే ప్రణాళికలు

- దన్నాయక్ దామోదర్ రావు, ట్రస్ట్ ప్రతినిధి



ట్రస్టు ద్వారా నెలరోజుల ముందే ప్రణాళికలు రూపొందించుకుంటాం. ట్రస్ట్ నియమ నిబంధనల మేరకు 32మంది కమిటీగా ఉండి ప్రతీనెల మూడో ఆదివారం సమావేశమవుతాం. ప్రతీసభ్యుడు ట్రస్ట్‌కు ఐదు వందల చొప్పున చెల్లిస్తారు. ఇలా జమ అయిన డబ్బుతో ప్రతీ నెలా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

(5వ పేజీ తరువాయి)

చెవుతున్నారు. సద్దుల బతుకమ్మ పర్వదినానికి అయినా తాము చేసిన పనులకు కూలి డబ్బులు అందిస్తే సంతోషమని కూలీలు తెలుపుతు న్నారు. పాలకుర్తిలో 882జాబు కార్డులు ఉన్నాయి. అందులో 388జాబు కార్డులపై 517మంది కూలీలు క్రమం తప్పకుండా పనులకు హాజరవుతున్నారు. బసంత్‌నగర్‌లో 995జాబు కార్డులుండగా 483జాబ్ కార్డులపై 561 మంది పనులు చేస్తున్నారు. మండ లంలో 9218జాబ్ కార్డులు ఉన్నాయి. 5332 జాబ్‌కార్డులపై 7726మంది కూలీలు క్రమంతప్పకుండా పనులకు హాజరవుతున్నారు. ఉపాధిహామీ పనులకు వెళ్తున్న కూలీలు అందరూ సాధారణ మధ్య తరగతికి కుటుంబాలకు చెందిన వారు కావడంతో నాలుగు నెలలుగా డబ్బులు అందకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పం దించి కూలి త్వరగా అందించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచరామి గ్రామానికి చెందిన పురెళ్ల రాజమల్లు అనేవృద్ధుడు ఇటీవల మృతిచెందాడు. ఈ సందర్భంగా బాధితుడి ఇంట్లో జరిగిన కార్యక్రమం లో ఎమ్మెల్యే పాల్గొని మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పురెళ్ల సత్తన్న, సంపత్, శ్రీనువాస్, రమేష్, నరేష్, పురెళ్ల ఫర్టిలైజర్ శ్రీనివాస్ గౌడ్, లట్టి రమేష్, చారి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు ఆపన్నహస్తం

కమాన్‌పూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇస్లాంనగర్‌కు చెందిన ఖదీర్ కుమార్తె వైద్య చికిత్స కోసం చత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో సేకరించిన రూ.51వేలను డాక్టర్ విజయ్ కుమార్ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు చత్రపతి శివాజీ యువసేన తమవంతుగా ఆర్థికసహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జంగపల్లి సతీష్, వ్యవస్థాపక అధ్యక్షుడు జంగపల్లి శ్రీనివాస్, మాజీఅధ్యక్షుడు మల్యాల శేఖర్ గౌడ్, పలు పార్టీల నాయకులు, మాచగిరి రామన్న, రంగు సత్యనారాయణ, గుర్రం లక్ష్మీమల్లు, గడప కృష్ణమూర్తి, అనవేనలక్ష్మీరాజం, కుక్క చంద్రమౌళి, మల్లారపు అరుణ్, యువసేన నాయకులు కొత్తపల్లి సతీష్, జంగపెల్లి చిన్న శ్రీనివాస్, తిరుపతి, రవి, అభి, శ్రవణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యాష్ ముఫారే జన్మదిన వేడుకలు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని యాష్ ముఫారే 53వ జన్మదిన వేడుకలను ఫౌండర్స్ ఘనంగా నిర్వహించారు. ముందుగా యాష్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రేడ్లు పంపిణీచేశారు. అనంతరం స్ఫూర్తిమానసిక దివ్యాంగుల కేంద్రంలో కేక్‌కట్‌చేసి, మిఠాయిలు పంపిణీచేసి, వారికి భోజనం అందించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఐటీ కంపెనీతో ప్రపంచానికి ఇంటర్నెట్ యాప్‌ల ద్వారా నూతన టెక్నాలజీ అందించడమే ధ్యేయంగా గోల్డ్ మెడలిస్ట్ యాష్ ముఫారే కృషి చేస్తున్నారని ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు.

విశిష్ట హోమియోపతి సైంటిస్టు అవార్డు అందుకున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్


అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

మంథని, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంథనికి చెందిన, హైదరాబాద్‌లోని జయసూర్య పొట్టి శ్రీరాములు గవర్నమెంట్ హోమి యో మెడికల్‌కాలేజ్ రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణ ప్రవీణ్‌కుమార్ జాతీయ స్థాయిలో విశిష్ట హోమియోపతి సైంటిస్టు అవార్డు-25ను అందుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో శనివారం జరిగిన హోమ్యాన్-25 జాతీయస్థాయి సమావేశంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు యూపీహైకోర్టు న్యాయమూర్తి మంజిత్ శుక్లా విశిష్టహోమియోపతి సైంటిస్టు అవార్డు-25ను ప్రదానంచేశారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో ఆయన్ని సన్మానించారు. డాక్టర్ సువర్ణ ప్రవీణ్‌కుమార్‌కు ఈ అవార్డు రావడం పట్ల మంథనికిచెందిన ఆయనస్నేహితులు పనకంటిచంద్రశేఖర్, లోకేరాధాకిషన్ రావు, నగునూరి శేఖర్, ఇల్లెందుల సత్యనారాయణ, లోకేమనోహర్, రావికంటి మనోహర్, టెక్కిగారికి రాధాకిషన్ ఎర్ర సురేష్ హర్షం వ్యక్తంచేశారు. డాక్టర్ ప్రవీణ్ కుమార్ మరెన్నో అవార్డులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

● ఏడీఏ అంజనీ మిశ్రా

మంథని, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని మంథని ఏడీఏ అంజనీమిశ్రా కోరారు. మంథని మండలానికి సంబంధించి రైతులకు పంపిణీ చేయటానికి ప్రభుత్వం నుంచి 2,250 యూరియా బస్తాలు వచ్చినట్లు ఆదివారం ఆమె తెలిపారు. మండలంలోని వివిధ వివిధ గ్రామాల్లో యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సంబంధిత గ్రామాలకు అందుబాటులో ఉన్న డీసీఎంస్, రైతు సేవా కేంద్రాల్లో కావాల్సిన యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు తమ మొక్క క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి యూరియా బస్తాలను పొందాలని అమె సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానించిన పూర్వవిద్యార్థులు

మంథని, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మంథని జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాల గణిత ఉపాధ్యాయుడు గీట్ల భరత్‌రెడ్డిని ఆయన శిష్యులు సాధన ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు ఆదివారం ఘనంగా సన్మానించారు. 1995-96సంవత్సరం పదవతరగతి చదువుకున్న విద్యార్థులు శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. సన్మాన గ్రహీత భరత్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తనబాధ్యతను మరింత పెంచిందన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రేగళ్ల వినయ్, రావి శ్రీనివాస్, నాగుల రాజేందర్, ఓల్లాల శ్రీధర్, మార్క చంద్ర శేఖర్, పెండ్లి ప్రభాకర్‌రెడ్డి, పెండ్యాల రాజేశ్వర్, కుక్కడపు రాము, రేఖ రాణి, పెద్దిరాజు నాగేందర్, సంపత్‌రెడ్డి, ఉమారాణి, కౌసల్య, నాగరాణి, కొమురవెల్లి శ్రీధర్, మాధవి పాల్గొన్నారు.

ఘన సన్మానం

కమాన్‌పూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన ఎస్ఎస్ అన్వర్‌ను మండల కేంద్రానికి చెందిన మైనారిటీ యువ నాయకుడు మెహరాజ్ అహ్మద్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా అధ్యక్షుడికి పుష్పగుచ్చం అందించి, శాలువాతో సన్మానించారు.

గ్రామాల్లో యూరియా పంపిణీ


ఎలిగేడులో యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

ఎలిగేడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపల్లిలో 340, దూళికట్టలో 340 బస్తాల యూరియాను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. వీటితోపాటు 250బాటిళ్ల నానో యూరియాప్లస్‌ని రైతులకు అందించి వాటి సస్యరక్షణలపై వివరించామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవోలు కేశెట్టివిక్రమ్, గడ్డం రవీందర్ రెడ్డి, ఏఈవోలు గణేష్, సురేష్, శరణ్య, పంచాయతీ కార్యదర్శులు ఆరెపల్లి పున్నమయ్య, శ్రవణ్‌కుమార్, సొసైటీసిబ్బంది పాల్గొన్నారు.

ఓదెల: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం దాదాపు 200మంది పైగా రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. వాటితోపాటు ప్రత్తి పంటల్లో మూడవదశ మందులు అవసరం ఉండగా, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రైతులు యూరియా బస్తాలను తీసుకెళ్లారు. రైతులకు కూడా యూరియా అవసరాలు చివరి దశకు చేరడంతో మరో రెండు రోజుల్లో రైతులకు యూరియా కొరత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

సుల్తానాబాద్: మండలానికి ఆదివారం 1100 బస్తాల యూరియా చేరుకుంది. ఈ బస్తాలను ఆయా గ్రామాల్లో పోలీసుల సహకారంతో ఎలాంటి ఆందోళనలు ఇబ్బందులు లేకుండా రైతులందరికీ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ సహకారంతో దగ్గరుండి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే విజయరమణారావు ఉన్నతాధికారులతో మాట్లాడి సుల్తానాబాద్ మండలానికి 1100బస్తాల యూరియాను పంపించారని సింగిల్ విండో ఛైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ వివరించారు. యూరియా బస్తాలను అందించిన ఎమ్మెల్యేకు సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీపీసీ ఉద్యోగులకు..మెరుగైన వేతన ఒప్పందం చేయిస్తాం

● విలేకరులతో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం


విలేకరులతో మాట్లాడుతున్న మల్లేశం

జ్యోతినగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఉద్యోగులకు మెరుగైన వేతన సవరణ ఒప్పందం చేయిస్తామని బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఎన్టీపీసీ ఎన్‌బీసీ సభ్యుడు సుంకరి మల్లేశం హామీ ఇచ్చారు. ఆదివారం ఎన్టీపీసీ వీజీపీ గెస్ట్‌హౌజ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10ఏళ్లకు ఒకసారి జరిగే వేజ్‌రివిజన్ 2027తో ముగియనున్నదని అన్నారు. ఈసారి బీఎంఎస్‌తోనే కార్మికులకు ప్రయోజనకరమైన వేతన ఒప్పందం జరగుతుందని స్పష్టం చేశారు. ఈనెల 25న జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో బీఎంఎస్‌ను గెలిపిచాలని మల్లేశం కోరారు. సమావేశంలో ఎన్టీపీసీ కార్మికసంఘ్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, సాగర్‌రాజు, చల్లా సత్యనారాయణరెడ్డి, బండారు కనకయ్య, పోగుల స్వామి, బుర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సేవలో సింగిల్ విండో

● త్వరలో ఫెస్టిసైడ్స్ విక్రయాలు

● పీఏసీఎస్ ఛైర్మన్ గోపు విజయ భాస్కర్ రెడ్డి


మాట్లాడుతున్న గోపు విజయభాస్కర్ రెడ్డి

ఎలిగేడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పనిచేస్తుందని ఆ సంఘం ఛైర్మన్ గోపు విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ప్రస్తుత వానాకాలంలో సాగుచేసిన పంటలకు 700మెట్రిక్ టన్నుల యూరియాను అందించామని, ఇంకా అవసరం ఉన్న రైతులకు మరో 20టన్నుల యూరియా అందిస్తామన్నారు. సహకారసంఘం పరిధిలోని 9గ్రామాల రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులను సమయానుకూలంగా అందిస్తున్నామన్నారు. త్వరలోనే పెస్టిసైడ్స్ పురుగుమందుల అమ్మకాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.1.15కోట్ల నిధులతో సంఘ అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. గ్రామాల్లో స్థలాలను కొనుగోలు చేసి సొంత భవనాలను నిర్మించుకొని స్వంతంగా ఆస్తులను సమకూర్చామని తెలిపారు. రూ.55.80లక్షల కమీషన్ రానున్నదని, వాటితో మరింత అభివృద్ధి సాధిస్తామని తెలిపారు.

గ్రీన్ గణపతి అవార్డులు అందజేత


విధులు నిర్వహించిన కానిస్టేబుల్‌కు అవార్డును అందజేస్తున్న ఎస్ఐ రమేష్

ఓదెల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 22గ్రామాల్లో తొమ్మిది రోజుల క్రితం పర్యావరణహితంగా వినాయక శోభాయాత్ర, నిమజ్జనం విజయవంతంగా నిర్వహించినందుకు పొత్కపల్లిలో ఆదివారం ఎస్ఐ దీకొండ రమేష్ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్సవ కార్యనిర్వాహకులకు ఆదివారం గ్రీన్ గణపతి అవార్డులను అందజేశారు. అలాగే వీరందరిని సన్మానించిన అనంతరం ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ, గణపతి నిమజ్జనం, శోభయాత్రలో డీజేలు ఉపయోగించకుండా , అలాగే మద్యం సేవించకుండ పర్యావరణహితంగా కొనసాగినందుకు నిర్వాహకులను అభినందించారు. అలాగే విద్యార్థులు, యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజహితమైన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం ఓదెల హనుమాన్‌నగర్‌కు చెందినవినాయకుడిని ఉత్తమ గణపతిగా గ్రీన్‌అవార్డు లభించింది. కార్యక్రమంలో మాజీసర్పంచ్ ఆకులమహేందర్, సదాశాయఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేరుగు భీష్మచారి, కోంద్రవేణు, మేరుగు సారంగం, ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, దాతరాకేష్, సాయినాథ్, కుమార్ పాల్గొన్నారు.

గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించండి

● మంచి వేతన సవరణకు కృషి చేస్తాం ● యుఈఈ యూనియన్ అధ్యక్షుడు ఎన్ భిక్షపతి



మాట్లాడుతున్న సీఐటీయూ, హెచ్ఎంఎస్ నాయకులు

జ్యోతినగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న జరిగే ఎన్టీపీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో సీఐటీయూ అనుబంధ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)ను గెలిపించాలని ఆ యూనియన్ అధ్యక్షుడు ఎన్ భిక్షపతి కోరారు. ఆదివారం ఎన్టీపీసీలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన వి లేకరుల సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ 2027లో జరగబోయే ఉద్యోగుల వేతన సవరణ విషయంలో సీఐటీయూ మెరుగైన వేతన సవరణ ఒప్పందం జరిగేలా కృషి చేస్తుందన్నారు. ఈసారి ఏ యూనియన్‌కు 60శాతం ఓట్లు నమోదయ్యే అవకాశం లేదని, రెండు ఎన్‌బీసీ పదవులు ఒకే యూనియన్‌కు రావన్నారు. ఈఎన్నికల్లో సీఐటీయూను గెలిపించి ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్‌లకు బుద్ధి చెప్పాలని భిక్షపతి కోరారు. హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ ఉపేందర్ మాట్లాడుతూ ఈసారి సీఐటీయూ యూనియన్‌కు తాము మద్దతు నిస్తున్నామన్నారు. గుర్తింపుసంఘంగా ఐఎన్‌టీయూసీ కార్మికులకు చేసిందేమీ లేదని, గతంలో తాము ప్రాతినిథ్యం వహించిన ఫ్రంట్ హయాంలోనే కార్మికులకు అనేక సౌకర్యాలు ఇప్పించామన్నారు. టౌన్‌షిప్‌లో పలు అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమ కార్యక్ర మాలను అమలు చేయించామని గుర్తుచేశారు. సమావేశంలో యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదునూరి భూమయ్య, ఈదునూరి రాజేశ్వర్, కోశాధికారి జి.భిక్షపతి, నాయకులు రామాచారి, పురుషోత్తం రాజు, టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.



తోట సమ్మయ్య సేవలు మరువలేనివి

కోల్‌సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూనిర్వాసితుల వాహనాల యజ మానుల సంఘం అధ్యక్షుడు తోట సమ్మయ్య ఆకస్మిక మృతి అందరినీ కలిచి వేసిందని భూనిర్వాసితుల వాహనాల సంఘం ప్రధాన కార్యదర్శి దబ్బెట మల్లేషం అన్నారు. ఆదివారం సింగిరెడ్డిపల్లిలో ఆయన నివాసంలో సమ్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించి రూ.1లక్ష ఆర్థిక సహాయాన్ని సమ్మయ్య కుమారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో భూములు కోల్పోయిన నిర్వాసితులకోసం అనేక పోరాటాలు నిర్వహించారని, సమ్మె సమయంలో సింగరేణి యాజమాన్యంతో శాంతియుతంగా చర్చలుజరిపి పరిష్కారంచూపిన సమ్మయ్య మృతి యజమానుల సంఘానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో తోడేటి సదానందం, ఇండ్లఓదెలు, నవీన్, కుమారస్వామి, నాగరాజు, శంకర్, రమేష్, శ్రీకాంత్, ఏలువాక సతీష్ పాల్గొన్నారు.

‘సచ్‌దేవ’లో చిత్రలేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

జ్యోతినగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ టీటీఎస్ లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఆదివారం చిత్రలేఖనం (ఆన్‌దిస్పాట్) పోటీలు నిర్వహించారు. పోటీల కార్యక్రమానికి ఎన్టీపీసీ జీఎం(ఓఅండ్ఎం) మనీష్ అగర్వాల్, డీజీఎం ప్రవీణ్ కె చౌదరి, మేనేజర్ స్నేహలత, అనుపమ, అశీష్‌లు అతిథులుగా పాలొన్నారు. పారిశ్రామిక ప్రాంతం నుం సుమారు వెయ్యిమంది విద్యార్థులు చిత్రలేఖనం పోటీలో పాల్గొన్నారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రం, విజేతలుగా నిలిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సచ్‌దేవ ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఎ కేటగిరిలో మాత్ృ మందిర్ పాఠశాలకుచెందిన వైష్ణీ, ప్రజ్ఞాసింగ్, శ్వేతన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి సాధించారు. బి కేటగిరిలో బి అదృష్టప్రియ, సాయి అశిత్, సాయి ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానం, సీ కేటగిరిలో లహరిక, హర్షవర్మ, మనుశ్రీ మొదటి, రెండవ, మూడవ బహుమతి, డికేటగిరిలో కె శివసాహితి, బి.వినీల, మహమ్మద్‌అయ్యాన్ ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారు.

మాజీ జడ్పీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి వివేక్

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మాజీ జడ్పీ టీసీ బండారి రాంమ్మూర్తి తండ్రి రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం రాత్రి కార్మికశాఖమంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి పరా మర్శించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాలవేసి నివా ళ్లు అర్పించారు. వారివెంట కాంగ్రెస్ నాయకుడు శ్రీధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాజీ జడ్పీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

రెడ్డి సేవా సంక్షేమ సంఘం కార్యవర్గం

మంథనిరూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెడ్డి సేవాసంక్షేమ సంఘం నూతనకార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. గౌరవఅధ్యక్షుడిగా మందల సత్యనారాయణరెడ్డి, అధ్యక్షుడిగా ముస్కుల సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కర్క కొండాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా యేలుక సత్యనారాయణరెడ్డి, సహాయకార్యదర్శిగా ముసిపట్ల రమణారెడ్డి, కోశాధికారిగా మూల శేఖర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా లంబు ప్రభాకర్‌రెడ్డి, గంట్ల పురేంద ర్‌రెడ్డి, బిల్లా రమణారెడ్డి, మాసిరెడ్డి రాజిరెడ్డి, మారం సత్యనారాయణరెడ్డి, లెక్కల కిషన్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు చంద్రు పట్ల సుధాకర్‌రెడ్డి, బెల్లంకొండ గిరిధర్‌రెడ్డి, గీట్ల భరత్‌రెడ్డి తెలిపారు.